క్లుప్తంగా

జీవీఎంసీ కార్మికుల వంటా వార్పు

మధురవాడ: మున్సిపల్ కార్మికులు రాష్ట్ర వ్యాప్తంగా చేస్తున్న సమ్మె గురువారానికి 3వ రోజుకు చేరింది. మధురవాడ జోన్ పరిధిలో గల 7, 8 వార్డు కార్యాలయాల వద్ద వంట వార్పు చేసి నిరశన తెలియజేశారు. ఏపీ మున్సిపల్ ఔట్ సోర్సింగ్ అండ్ కాంట్రాక్ట్ కార్మిక సంఘం ఉప ప్రధాన కార్యదర్శి ఎంవీ ప్రసాద్, సీఐటీయూ మధురవాడ జోన్ ఉపాధ్యక్షుడు డి.అప్పలరాజు, జి.కిరణ్, నరసింగరావు, ఎం.సుశీలమ్మ, వి.సంధ్య, ఎస్.రాములప్పడు, బి.రాంబాబు, కె.రాజు, కాకర నాగరాజు ఎస్.లక్ష్మి, ఎన్.లక్ష్మి, పి.సుజాత తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన మహా నారాయణ సేవ



దాతలకు జ్ఞాపికలు అందిస్తున్న ఆలయ సేవా సంఘం సభ్యులు

భీమునిపట్నం: భీమిలిలోని వీరాంజనేయ అయ్యప్ప స్వామి సేవా సంఘం ఆధ్వర్యంలో మహానారాయణ సేవ గురువారం ముగిసింది. అయ్యప్ప, భవానీలతోపాటు ఇతర మాలలు ధరించిన వారికి 45 రోజులపాటు మధ్యాహ్నం మహానారాయణ సేవ నిర్వహించారు. ఈ సందర్భంగా విరాళాలు ఇవ్వడంతోపాటు, ఇతర విధాలుగా సహకరించిన దాతలకు సేవా సంఘ కార్యవర్గ సభ్యులు జ్ఞాపికలు ఇచ్చి సత్కరించారు. హిందూ ధర్మ పరిరక్షణ సమితి అధ్యక్షుడు మైలిపల్లి షణ్ముఖరావు, ఎగువపేట గ్రామాభివృద్ధి సేవా సంఘం అధ్యక్షుడు గంటా నూకరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ అల్లిపిల్లి నర్సింగరావు, సేవా సంఘ అధ్యక్షుడు కొమ్మినేని ఎర్రునాయుడు, ప్రధాన కార్యదర్శి మొకర నర్సింగరావు, కోశాధికారి పిల్లి శ్రీను, ఉపాధ్యక్షులు కదిరి జగన్నాథం ఇతర సభ్యులు పాల్గొన్నారు.

పథకాలు సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న కేంద్ర ఆర్థిక శాఖ సంయుక్త కార్యదర్శి ఆరోఖ్య రాజ్

పద్మనాభం: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కేంద్ర ఆర్థిక శాఖ సంయుక్త కార్యదర్శి ఆరోఖ్య రాజ్ సూచించారు. మండలంలోని శేరిఖండంలో వికసిత్ భారత్ అమలు తీరును గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆరోఖ్య రాజ్ మాట్లాడుతూ పీఎం జ్యోతి బీమా యోజన, పోషన్ అభియాన్ పథకాలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు అందకపోతే అధికారుల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ సుంకర గిరిబాబు, జిల్లా పరిషత్ సీఈవో ఎం.పోలినాయుడు, ట్రైనీ కలెక్టర్ మాధురి, ఎంపీడీవో కె.ప్రభాకర్ రావు, సర్పంచ్ పల్లంటి చిన్నారావు, బీజేపీ భీమునిపట్నం నియోజకవర్గ కన్వీనర్ కంటుభుక్త రామానాయుడు, బీజేపీ మండల అధ్యక్షుడు రెడ్డిపల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ గెలుపునకు కృషి

పీఎం పాలెం: రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థుల విజయం కోసం రాష్ట్రంలోని శిష్టకరణాలను ఐక్యం చేయడానికి కృషి చేస్తానని శిష్ట కరణాల వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ అనూష పట్నాయక్ అన్నారు. స్థానిక కార్యాలయంలో పీఎం పాలెం శిష్టకరణాల సేవా సంఘం అధ్యక్షుడు డొంకాడ అనిల్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో గురువారం ఆమె మాట్లాడారు. సంక్షేమ పథకాలు అమలు చేయడంలో ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి దేశంలో తొలిస్థానంలో నిలిచారన్నారు. కార్యక్రమంలో అరికతోట చంద్రమౌళి, శివ మాస్టారు, ఎన్ఎం రావు, జయతి గోపి పట్నాయక్, డబ్బీరు ప్రశాంతి పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల నిరశన

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ కాంట్రాక్ట్ పారిశుధ్య కార్మికులు గురువారం అంబేడ్కర్ కూడలి వద్ద మానవహారం చేపట్టారు. తమ డిమాండ్ల సాధన కోసం ముందుగా ర్యాలీ నిర్వహించారు. కనీస వేతనం, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్, వారసత్వ ఉద్యోగాలు కల్పించాలని కోరారు. నాయకులు ఆర్ఎస్ఎన్ మూర్తి, రవ్వ నరసింగరావు, సురేష్, సన్ని, శ్రీను, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతలకు వరం



- అగ్రిటెస్టింగ్ ల్యాబ్‌తో రైతులకు మేలు
- నాణ్యమైన పరీక్షలతో లాభసాటిగా పంటల దిగుబడులు



భీమిలిలోని వైఎస్సార్ అగ్రిటెస్టింగ్ ల్యాబ్

భీమునిపట్నం: భీమిలి వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన డాక్టర్ వైఎస్సార్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్ రైతులకు వరంగా మారింది. ఇక్కడ వివిధ పంటలకు చెందిన విత్తనాలు, ఎరువుల నాణ్యతను పరీక్షిస్తున్నారు. గతంలో ఇటువంటి అవకాశం లేకపోవడంతో రైతులు నష్టపోయేవారు. రూ.73.54 లక్షలతో నిర్మించిన ఈ ల్యాబ్ 2021 ఆగస్టు 7 నుంచి అందుబాటులోకి వచ్చింది. ఇక్కడ వరి, బెండ, టమోటా, మినుములు, పెసలు, మొక్కజొన్న, వేరుశనగతోపాటు ఇతర పంటల విత్తనాల నాణ్యతను పరీక్షిస్తారు. ఇందులో ఒక అఫీషియల్ ఎనలిస్ట్, ఇద్దరు అసిస్టెంట్ ఎనలిస్టులు పని చేస్తున్నారు. భీమిలి, ఆనందపురం, పద్మనాభం మండలాల రైతులు స్వయంగా తయారు చేసుకున్న, లేక కొనుగోలు చేసిన విత్తనాలను నిర్దేశించిన ప్రకారం ఆయా పంటలకు సంబంధించి 40 గ్రాముల నుంచి ఒక కిలోవరకు ఇక్కడకు తీసుకొస్తే నాణ్యత పరీక్షించి ఇస్తారు. ఆయా విత్తనాలకు నిర్ణయించిన ప్రకారం మొలకల నాణ్యత 75 నుంచి 98 శాతం వరకు ఉండాలి. అలా లేకపోతే అవి సాగు చేయడానికి పనికి రానివిగా



ల్యాబ్‌లో విత్తనాలు పరీక్షిస్తున్న సిబ్బంది

పరిగణిస్తారు. తద్వారా ఆయా ప్రాంతాల రైతులు స్వయంగా విత్తనాలు తేవడంతోపాటు రైతు భరోసా కేంద్రాల (ఆర్‌బీకే)ల ద్వారా కూడా పరీక్షలకు విత్తనాలు వస్తున్నాయి.

నకిలీ విత్తనాలకు చెక్

ప్రైవేటు వ్యాపారులు నకిలీ విత్తనాలు విక్రయించకుండా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. అందులో భాగంగా వ్యవసాయశాఖ అధికారులు జిల్లాలోని విత్తనాలు విక్రయించే షాపుల్లో వాటి నమూనాలు సేకరిస్తున్నారు. వాటిని విశాఖలోని రీజినల్ కోడింగ్ సెంటర్‌కు పంపుతున్నారు. అదే పద్ధతిలో రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లోని విత్తనాలు సేకరిస్తున్నారు. అవి జంబ్లింగ్ పద్ధతిలో టెస్టింగ్ ల్యాబ్‌లకు పంపిస్తున్నారు. ఉదాహరణకు భీమిలి ల్యాబ్‌కు ఇతర జిల్లాల్లో సేకరించే విత్తనాలు, ఈ జిల్లా విత్తనాలు మరో ప్రాంతానికి పంపిస్తారు. దీనివల్ల అవకతవకలు లేకుండా ఫలితాలు వస్తాయి. తద్వారా నకిలీ విత్తనాల సమస్య పూర్తిగా పరిష్కారమవుతుంది. ఈ కేంద్రంలో ఎరువుల నాణ్యతకు సంబంధించిన పరీక్షలు కూడా నిర్వహిస్తున్నారు. విత్తనాల నాణ్యత సరిగా ఉండి, ఎరువులు సరిగ్గా లేకపోతే పంటల దిగుబడి తగ్గిపోతుంది. అందువల్ల ఈ విషయంలో కూడా శ్రద్ధ తీసుకుంటున్నారు. ఈ ల్యాబొరేటరీలో పశువ్యాధుల నిర్ధారణ ప్రయోగశాల కూడా ఉంది. ఇందులో ఆవులు, గేదెలు, మేకలు, గొర్రెలు, బాతులు, కోళ్లు మొదలైన వాటికి సంబంధించి అవసరమైన పరీక్షలు చేసి వ్యాధులను నిర్ధారిస్తారు.



ల్యాబ్‌లో విత్తనాలు, ఎరువులు పరీక్షించే యంత్రాలు



పశువుల వ్యాధి నిర్ధారణ శాంపిల్ పరీక్షిస్తున్న సిబ్బంది

ల్యాబ్‌లో పరీక్షలు ఇలా...

- భీమిలిలోని ల్యాబ్‌లో 2021 జూలై నుంచి 2022 మార్చి వరకు 38 విత్తనాల నమూనాలు, 19 ఎరువుల నమూనాలు, 283 పశువులకు వ్యాధుల నిర్ధారణ పరీక్షలు చేశారు.
- 2022 మార్చి నుంచి 2023 మార్చి వరకు 176 విత్తనాల నమూనాలు, 95 ఎరువుల నమూనాలు, 2,875 పశువులకు వ్యాధుల నిర్ధారణ పరీక్షలు చేశారు.
- 2023 మార్చి నుంచి ఇప్పటి వరకూ 217 విత్తనాల నమూనాలు, 128 ఎరువుల నమూనాలు, 1,658 పశువులకు వ్యాధుల నిర్ధారణ పరీక్షలు చేశారు.

కచ్చితమైన ఫలితాలతో లాభం



ల్యాబ్‌లో విత్తనాలు, ఎరువుల నాణ్యత పరీక్షించి ఫలితాలు వెల్లడించడంతో ఎంతో ఉపయోగకరంగా ఉంటోంది. గతంలో ఈ సదుపాయం లేకపోవడంతో చాలా వరకు పంట నష్టపోయేవారిమి. ఈ విధానం అందుబాటులోకి వచ్చాక సాగు లాభసాటిగా ఉంటోంది.

– సారిక పైడినాయుడు, మునివానిపాలెం, పద్మనాభం మండలం

మోసాలు, కష్టాలు తప్పాయి



గతంలో ఎరువులు, విత్తనాలు వేల రూపాయలతో కొనుగోలు చేస్తే వాటిల్లో నకిలీవి ఉండడంతో సరైన పంట దిగుబడులు రాక నష్టపోయేవారిమి. అగ్రి టెస్టింగ్ ల్యాబ్ వల్ల అటువంటి వాటికి అవకాశం లేకపోవడంతో నష్టాలు తగ్గాయి.

– పొంద్రంగి నారాయణప్పుడు, జగన్నాథపురం, ఆనందపురం మండలం

టెలిఫోన్ సలహా కమిటీ సభ్యునిగా శ్రీధర్



పంపాన శ్రీధర్

తగరపువలస: టెలిఫోన్ సలహా కమిటీ సభ్యునిగా తగరపువలసకు చెందిన బీజేపీ సీనియర్ నాయకుడు పంపాన శ్రీధర్‌ను నియమించారు. ఈ మేరకు న్యూఢిల్లీకి చెందిన బీఎస్ఎన్ఎల్ సీఎండీ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ తనకు అవకాశం కల్పించిన కేంద్ర మంత్రి దినేష్ చంద్ర, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కాశీ విశ్వనాథరాజు, మాధవ్, విష్ణుకుమార్ రాజు, మేడపాటి రవీంద్రరెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. శ్రీధర్‌ను ఉప్పాడ అప్పారావు, కంటుబుక్త రామానాయుడు తదితరులు అభినందించారు.

యువజన విభాగాల అధ్యక్షులతో సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు

తగరపువలస : ఇటీవల కొత్తగా నియమితులైన వైఎస్సార్ సీపీ మండల యువజన విభాగాల అధ్యక్షులతో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు గురువారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిర్వహించాల్సిన విధులపై చర్చించారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయానికి అంతా కృషి చేయాలని సూచించారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు ఆళ్ల శివగణేష్, బింగి హరికిరణ్‌రెడ్డి, చిల్ల హరి, అక్కరమాని చినబాబు తదితరులు పాల్గొన్నారు.

సంతపేటలో రక్తదానం

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ రెండో వార్డు వైఎస్సార్‌సీపీ నాయకుడు నీలాపు సురేష్ రెడ్డి గురువారం సంతపేట చిల్డ్రన్స్ పార్కులో రక్తదాన శిబిరం నిర్వహించారు. పలువురు యువకులు ఈ శిబిరంలో పాల్గొని రక్తదానం చేశారు.

ట్యాబ్‌ల పంపిణీపై ప్రతిపక్షాలది అనవసర రాద్ధాంతం



చిప్పాడ హైస్కూల్‌లో ట్యాబ్‌లతో విద్యార్థులు, ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, తదితరులు

తగరపువలస: రాష్ట్రంలో విద్యార్థులకు నాణ్యమైన సాంకేతిక విద్య అందించే క్రమంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి 8వ తరగతి నుంచి ట్యాబ్‌లు పంపిణీ చేస్తుంటే ప్రతిపక్షాలు ఓర్వలేక అనవసర రాద్ధాంతం చేస్తున్నాయని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. గురువారం సాయంత్రం భీమిలి మండలం చిప్పాడ జెడ్పీ హైస్కూల్‌లో 39 మంది విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మఒడి ద్వారా విద్యార్థులకు ప్రభుత్వం రూ.6 వేల కోట్లు పంపిణీ చేస్తుందన్నారు. దీనిని రాజకీయం చేయడం తగదన్నారు. అనంతరం నాడు – నేడు ద్వారా జరుగుతున్న పనుల వివరాలను ప్రధానోపాధ్యాయురాలు ఎం.వి.టి.రత్నంను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు వెంపాడ సూరిబాబు, సరగడ రఘునాథరెడ్డి, దాట్ల పెదబాబు, ఎలమంచిలి సూర్యానారాయణ, దంతులూరి వాసురాజు, బోని బంగారునాయుడు, గాడు శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

కిరాణా దుకాణాలపై 14 కేసులు



కిరాణా షాపులో బియ్యం ప్యాకెట్‌పై ముద్రించిన ధర,బరువు పరిశీలిస్తున్న రాధాకృష్ణ

తగరపువలస: స్థానికంగా ఉన్న కిరాణా దుకాణాల్లో బియ్యం ప్యాకెట్లపై ముద్రించిన ధర, బరువుల విషయంలో వినియోగదారుల ఫిర్యాదు మేరకు గురువారం గాజువాకకు చెందిన లీగల్ మెట్రాలజీ అసిస్టెంట్ కంట్రోలర్ ఎస్.ఎం.రాధాకృష్ణ తనిఖీలు చేపట్టారు. బరువు, ధరలు సక్రమంగా ఉన్నా ప్యాకేజీ నిబంధనలు పాటించని వారిపై 12 కేసులు, ఎలక్ట్రానిక్ తూనిక యంత్రాలకు ముద్రలు లేనందున రెండు షాపులపై కేసులు నమోదు చేశారు. తనిఖీల్లో ఆయనతోపాటు మరో ఇద్దరు అసిస్టెంట్ కంట్రోలర్లు ఎన్.వి.రమణమూర్తి, పి.చిన్నమ్మ, పరిశీలకురాలు ఎస్.ఉమాసుందరి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ పాలనలోనే పేదలకు మేలు



చిప్పాడ సచివాలయం వద్ద సంక్షేమ పథకాల ఫ్లెక్సీ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు

తగరపువలస: వైఎస్సార్‌సీపీ పాలనలోనే పేదలకు మేలు జరుగుతోందని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే' కార్యక్రమం భీమిలి మండలం చిప్పాడ పంచాయతీలో గురువారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీలో సంక్షేమ, అభివృద్ధి పథకాల కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి గత అయిదేళ్లలో రూ.26 కోట్లు ఖర్చు చేశారన్నారు. ఒక్కో కుటుంబానికి రూ.1,92,000 వరకు లబ్ధి చేకూరిందన్నారు. చంద్రబాబు హయాంలో ప్రజలకు ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదన్నారు. పంచాయతీలో 90 డ్వాక్రా సంఘాలకు మూడు విడతలుగా రూ.1.81 కోట్లు రుణమాఫీ చేశామన్నారు. జనవరి మొదటి వారంలో మరో విడత మాఫీ సొమ్ము మహిళల ఖాతాల్లో జమ చేయనున్నారన్నారు. పెరిగిన సామాజిక పెన్షన్లు రూ.3 వేలు వంతున పంపిణీ చేయనున్నామన్నారు. కరోనా సమయంలో కూడా రాష్ట్ర ప్రజలకు సాయం అందించిన సీఎం జగన్‌ను మళ్లీ 2024లోనూ ముఖ్యమంత్రిని చేసుకోవాలన్నారు. భోగాపురం ఎయిర్‌పోర్టుకు ఆరు లైన్ల రహదారి చిప్పాడ పంచాయతీ మీదుగానే వెళ్తుందన్నారు. ఈ సందర్భంగా సంక్షేమ పథకాల ఫ్లెక్సీ ఆవిష్కరించి, వైఎస్సార్ సీపీ పతాకం ఎగురవేశారు. సర్పంచ్ వెంపాడ రమావతి, వ్యవసాయశాఖ జిల్లా సలహా మండలి చైర్మన్ దాట్ల పెదబాబు, ఏఎంసీ చైర్మన్ యలమంచిలి సూర్యనారాయణ, ఎంపీపీ దంతులూరి వాసురాజు, వైస్ ఎంపీపీ బోని బంగారునాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు గాడు శ్రీను, మండల సచివాలయాల కన్వీనర్ సరగడ రఘునాథరెడ్డి, వెంపాడ సూరిబాబు, సరగడ రాంబాబు, నమ్మి లక్ష్మణరావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు చెల్లూరి నగేష్, పొట్నూరు చంద్రశేఖర్, బొడ్డు దుర్గారావు, తోట ఎల్లారావు, చిల్ల వెంకటరమణ, గిడిజాల రమణ, సాడి రాంబాబు పాల్గొన్నారు.

విద్యా ప్రమాణాల పెంపునకు కృషి



మాట్లాడుతున్న డీఈవో చంద్రకళ

మధురవాడ: విద్యా ప్రమాణాలు పెంచడానికి మరింత కృషి అవసరమని డీఈవో ఎల్.చంద్రకళ అన్నారు. చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ప్రాథమిక పాఠశాలలు, మ్యాథ్స్ స్కూల్ కాంప్లెక్స్ మీటింగ్‌ను ఆమె గురువారం సాయంత్రం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధ్యాయులు బోధనతోపాటు ఎండీఎంను సక్రమంగా నిర్వహించాలన్నారు. పదో తరగతిలో ఉత్తీర్ణత శాతం పెంచేందుకు మరింత ప్రణాళికతో వ్యవహరించాలని సూచించారు.

స్కూల్ కాంప్లెక్స్ పరిశీలన

ఆనందపురం: స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో ఆనందపురం, పద్మనాభం మండలాల గణిత ఉపాధ్యాయులకు జరుగుతున్న స్కూల్ కాంప్లెక్స్‌ను ఆర్జేడీ జ్యోతి కుమారి, డీఈవో ఎల్.చంద్రకళ గురువారం వేర్వేరుగా సందర్శించారు. ఈ సందర్భంగా వారు ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడారు. ప్రతీ విద్యార్థి పట్ల శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని ఖాళీ సమయాల్లో గణిత ఉపాధ్యాయులు ప్రాథమిక పాఠశాలలకు వెళ్లి మెలకువలు నేర్పించాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు బి.శ్రీనివాసరావు, ఎంఈవోలు పద్మావతి, గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

డీప్ లెర్నింగ్‌పై ప్రసంగం



ప్రొఫెసర్ రాఘవను సత్కరిస్తున్న గీతం ప్రతినిధులు

కొమ్మాది: డెన్మార్క్‌లోని కోపెన్ హెగెన్ బిజినెస్ స్కూల్‌కు చెందిన సెంటర్ ఫర్ బిజినెస్ డేటా ఎనలిటిక్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎం.రాఘవ గురువారం గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఇంజినీరింగ్ విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. డీప్ లెర్నింగ్ మెథడ్స్‌పై ప్రపంచ వ్యాప్తంగా వస్తున్న మార్పులను ఆయన వివరించారు. అనంతరం విద్యార్థుల సందేహాలు నివృత్తి చేశారు. కార్యక్రమంలో కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ విభాగాధిపతి ప్రొఫెసర్ ఆర్.శిరీష తదితరులు పాల్గొన్నారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..

చురుగ్గా 'ఆడుదాం ఆంధ్ర' ఆటల పోటీలు



ప్రధానోపాధ్యాయుడు నాయుడుకు సౌండ్ సిస్టమ్ అందిస్తున్న ఎంపీపీ వాసురాజు



మూలకుద్దులో వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు

తగరపువలస: 'ఆడుదాం ఆంధ్ర' ఆటల పోటీలు భీమిలి మండలంలో చురుగ్గా సాగుతున్నాయి. దాకమర్రి పంచాయతీలో ఎంపీపీ దంతులూరి వాసురాజు పోటీలు ప్రారంభించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి డి.రఘునాథబాబు, ఎంపీటీసీ సభ్యుడు చెల్లూరి నగేష్ తదితరులు పాల్గొన్నారు.

తాటితూరు పంచాయతీలో సర్పంచ్ శిరిగుడి సంతోషి ఆటల పోటీలు ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు ఉండబట్ల ఆదిలక్ష్మి, శిరిగుడి ఈశ్వరరావు పాలొన్నారు. పెద నాగమయ్యపాలెం పంచాయతీలో క్రికెట్ పోటీలను బొడ్డు సత్తెమ్మ ప్రారంభించగా బొడ్డు దుర్గారావు, తోట ఎల్లారావు తదితరులు పాల్గొన్నారు. మూలకుద్దు పంచాయతీలో వాలీబాల్ పోటీలను ఇన్‌చార్జి సర్పంచ్ కొయ్య రామకృష్ణారెడ్డి, కొల్లి కోటిరెడ్డి తదితరులు ప్రారంభించారు.

హైస్కూల్‌కు సౌండ్ సిస్టమ్ వితరణ

భీమిలి మండలం దాకమర్రి జెడ్పీ హైస్కూల్‌కు ఎంపీపీ దంతులూరి వాసురాజు రూ.16 వేల విలువైన సౌండ్ సిస్టమ్ గురువారం అందించారు. ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల అభ్యర్థన మేరకు సొంత ఖర్చులతో దీనిని కొనుగోలు చేసినట్టు వాసురాజు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ చెల్లూరి పైడప్పడు, ఎంపీటీసీ సభ్యుడు చెల్లూరి నగేష్‌బాబు పాల్గొన్నారు.

2వ వార్డులో విజయోత్సవాలు



బోరుబావిని ప్రారంభిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

తగరపువలస: జీవీఎంసీ రెండో వార్డులో 30 ఏళ్లుగా జరగని అభివృద్ధి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో జరిగినందున ఆ పార్టీ నాయకులు గురువారం విజయోత్సవం నిర్వహించారు. నమ్మివానిపేట శ్మశానవాటికకు రూ.27 లక్షలతో నిర్మించిన ప్రహరీ వద్ద ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. కొత్తగా నిర్మించిన బోరుబావిని ప్రారంభించారు. అనంతరం వార్డు ఇన్‌చార్జి శిల్లా కరుణాకరరెడ్డి మాట్లాడుతూ నమ్మివానిపేట సచివాలయం పరిధిలో సంక్షేమ పథకాల కోసం రూ.3.20 కోట్లు, అభివృద్ధి పనుల కోసం రూ.18.35 కోట్లు అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. రెండో వార్డులో సంక్షేమం, అభివృద్ధికి కలిపి మొత్తం రూ.110 కోట్లు ఖర్చు చేశారన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి జీరు వెంకటరెడ్డి, విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు నమ్మి లక్ష్మణరావు, వంశీరెడ్డి, జగన్నాథ ఎల్లాజీ, నమ్మి మాధవ, చిల్ల ప్రమీల, చేట్ల శ్రీనివాసరెడ్డి, ఊడికల శ్రీరామమూర్తి, సరగడ నాగిరెడ్డి, మద్ది మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ఇంటికే సంక్షేమ పథకాలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

పీఎం పాలెం : భారత రాజకీయ చరిత్రలో ప్రజా సంక్షేమ పథకాలు నేరుగా ప్రజల ముంగిటకే అందజేసిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. జీవీఎంసీ 6వ వార్డు 44వ నంబరు సచివాలయం పరిధిలో గురువారం సాయంత్రం 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భగా స్థానికులు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అమలు చేస్తున్న నవరత్నాలు వల్ల తమ కుటుంబాల ఆర్థిక పరిస్థితులు మెరుగుపడడంతోపాటు పిల్లలకు నాణ్యమైన ప్రభుత్వ విద్య అందుతోందని ఆనందం వ్యక్తం చేశారు. రానున్న ఎన్నికల్లో మరోమారు భీమిలి ఎమ్మెల్యేగా ముత్తంశెట్టి శ్రీనివాసరావును గెలిపించుకుని జగనన్నను మళ్లీ సీఎం పీఠంపై కూర్చోబెడతామన్నారు. స్థానికంగా కమ్యూనిటీ హాలు నిర్మించాలలని, అంగన్‌వాడీ కేంద్రం అదనంగా ఏర్పాటు చేయాలని స్థానికులు ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు గాదె రోశిరెడ్డి, బొట్ట అప్పారావు, వీవీ నరసింహారావు, పోతిన సూరిబాబు, కృష్ణమూర్తి పాత్రుడు, జామి శివకుమార్ పాల్గొన్నారు.

బొట్టవానిపాలెంలో రూ.40 లక్షలతో అభివృద్ధి పనులు

మధురవాడ: అన్ని వర్గాల అభ్యున్నతికి సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి విశేష కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. జీవీఎంసీ 5వ వార్డు బొట్టవానిపాలెం బ్లూసిటీ అపార్ట్‌మెంట్ నుంచి ఎంపీపీ స్కూల్ వరకు రూ.40 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు, కల్వర్టు, కాలువల నిర్మాణ పనులకు గురువారం సాయంత్రం శంకుస్థాపన చేశారు. కొద్ది నెలల కిందట 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా ఈ ప్రాంతంలో పర్యటించిన ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు దృష్టికి స్థానికులు పలు సమస్యలు తీసకొచ్చారు. వెంటనే ఆయన వాటి పరిష్కారానికి నిధులు మంజూరు చేసి, పనులు ప్రారంభించడంతో అపార్ట్‌మెంట్ వాసులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పోతిన హనుమంతురావు, పిళ్లా సూరిబాబు, పీకేఎం పాత్రుడు, బోర శ్రీను, బోయి సూర్రెడ్డి, అప్పలరాము, చంద్రరావు, జేఎస్ రెడ్డి, లక్ష్మణ, రామారావు, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

సింహాచలం : సాధారణ మరమ్మతులు కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ పి.శ్రీనివాసరావు తెలిపారు. జీవీఎంసీ 98వ వార్డు పరిధిలోని సింహపురికాలనీ, షిప్‌యార్డ్ లే అవుట్, గోశాల జంక్షన్, కోనేరు రోడ్డు, సింహాచలం ఆర్టీసీ కాంప్లెక్స్ తదితర ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, తిరిగి మధ్యాహ్నం రెండు గంటల నుంచి నాలుగు వరకు విద్యుత్ సరఫరాకి అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు.

తగరపువలస: భీమిలి మండలం తాళ్లవలస రూరల్ ఫీడర్ పరిధిలో నిర్వహణ పనుల కారణంగా శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుంది. ఈ కారణంగా తాళ్లవలస, వనుముపేట, రాయినపేట, వలందపేట, తాళ్లవలస, లెజెంట్, మహిత, హాసిని, హార్మనీ లే అవుట్ పరిసరాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోతుంది.

- చేపలుప్పాడ ఫీడర్ పరిధిలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుంది. దీని కారణంగా ఆర్‌పై అగ్రహారం, చేపలుప్పాడ, పెద్ద ఉప్పాడ, చిన్న ఉప్పాడ, కొత్తూరు, గంగడిపాలెం, గోవుపేట, పుక్కళ్లపాలెం, ఐఎన్ఎస్ కళింగ, నేరెళ్లవలస, గణేష్ లే అవుట్, నవరత్న ఎస్టేట్ విల్లాస్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోతుంది.
- **పీఎం పాలెం :** స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని 11 కేవీ రెవెన్యూ ఫీడర్ ఏరియాలో విద్యుత్ లైన్ల నిర్వహణ, జంగిల్ క్లియరెన్స్ పనులు చేపడుతున్నందున శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 వరకూ విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నామని విశాఖ ఆపరేషన్ జోన్ – 3 ఈఈ పోలాకి శ్రీనివాసరావు తెలిపారు. ప్రకటించిన సమయంలో రెవెన్యూ కాలనీ, వాటర్ ట్యాంక్ రోడ్, శివాలయం వీధి, ఎస్ఎఫ్ఎస్ స్కూలు, ఎంవీపీ ఎన్ క్లేవ్ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని తెలిపారు.